ఎమ్మెల్యే సత్యం కుటుంబానికి కేటీఆర్ పరామర్శ


ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, పిల్లలను ఓదార్చుతున్న కేటీఆర్

మచ్చబొల్లారం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కుటుంబాన్ని అల్వాల్ సర్కిల్ పంచశీలకాలనీలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం పరామర్శించారు. ఎమ్మెల్యేకు ఆయన పిల్లలకు ధైర్యం చెప్పారు. ఇటీవల ఎమ్మెల్యే సతీమణి రూపాదేవి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. చిన్న వయసులో కుటుంబానికి తీరని లోటు జరిగిందని కేటీఆర్ పేర్కొన్నారు. కేటీఆర్ వెంట బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వివేకానంద్, పాడి కౌశిక్ రెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, అల్వాల్ కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నగరానికి విదేశీ మీడియా ప్రతినిధుల రాక

- పర్యాటక కేంద్రాల సందర్శన


గోల్కొండకోటలో విదేశీ మీడియా ప్రతినిధులతో మంత్రి కొండా సురేఖ

హైదరాబాద్/మాదాపూర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిన పలు ప్రఖ్యాత పర్యాటక కేంద్రాలను సందర్శించేందుకు హైదరాబాద్‌కు చేరుకున్న విదేశీ మీడియా ప్రతినిధులకు శంషాబాద్ రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో సమాచార-పౌరసంబంధాల శాఖ, ప్రొటోకాల్ విభాగం అధికారులు ఘన స్వాగతం పలికారు. భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు చెందిన విదేశీదౌత్యవ్యవహారాల విభాగం అధికారుల పర్యవేక్షణలో జాతీయ, అంతర్జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన ప్రఖ్యాత పర్యాటక కేంద్రాలను విదేశీ మీడియా ప్రతినిధులు సందర్శించనున్నారు. నాలుగు రోజుల తెలంగాణ పర్యటనలో భాగంగా బుధవారం గోల్కొండ కోటను సందర్శించారు. ఆషాడ బోనాల ఏర్పాట్లను పరిశీలించేందుకు గోల్కొండ కోట జగదాంబిక ఆలయానికి వెళ్లిన రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ విదేశీ మీడియా ప్రతినిధులకు స్వాగతం పలికారు. గోల్కొండ కోట చరిత్ర, కులీకుతుబ్‌షాల పాలన, అప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రతియేటా ఆషాడమాసంలో నిర్వహించే బోనాల వేడుకల ప్రాశస్త్యాన్ని వారికి వివరించారు. అనంతరం విదేశీ మీడియా ప్రతినిధుల బృందం శిల్పారామంను సందర్శించింది. అక్కడ తెలంగాణ హస్త కళాకారుల ఉత్పత్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా రితిక, తనిష్కలు ప్రదర్శించిన కూచిపూడి ప్రదర్శన ఆకట్టుకుంది.

ఇంగ్లిష్ ఛానెల్‌ను ఈదిన తొలి తెలుగు మహిళ

- గంధం క్వీణి విక్టోరియా రికార్డు


గంధం క్వీణి విక్టోరియా(సర్కిల్‌లో)

బర్కత్‌పుర, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): గంధం క్వీణివిక్టోరియా ప్రపంచమంతా స్విమ్ ఎవరెస్ట్‌గా పిలుచుకునే ఇంగ్లిష్ ఛానెల్‌ను 44 ఏళ్ల వయస్సులో ఈదిన తొలి తెలుగు మహిళగా రికార్డు నెలకొల్పారు. ఈ నెల 24న బ్రిటీష్ కాలమానం ప్రకారం రాత్రి 10 గంటల 46 నిమిషాలకు ఇంగ్లాండ్‌లోని డోవర్ కోస్ట్ నుంచి రిలే స్విమ్మింగ్ ప్రారంభించి 25న సాయంత్రం 4 గంటల 16 నిమిషాలకు ఫ్రాన్స్ దేశంలోని ఫ్రెంచి కోస్ట్‌కు చేరుకుంది. ఇంగ్లండ్, ఫ్రాన్స్ దేశాల మధ్య ఉన్న ఉత్తర అట్లాంటిక్ మహాసముద్రాన్ని ఇంగ్లిష్ ఛానెల్‌గా పిలుస్తారు. ఈ రెండు దేశాల మధ్య దూరం 36 కిలోమీటర్లు. రాత్రి వేళల్లో అలల తాకిడి అధికంగా ఉండడం వల్ల 71 కిలోమీటర్ల మేర క్రాస్ స్విమ్మింగ్ చేసి 16 గంటల 50 నిమిషాలలో ఇంగ్లిష్ ఛానెల్‌ను ఒక వైపు ఈదడం జరిగిందని గంధం క్వీణివిక్టోరియా తెలిపారు. 8 మంది బృందంతో కలిసి ఇంగ్లండ్‌కు వెళ్లానని చెప్పారు. బ్లూడాల్ఫింగ్ స్విమ్మింగ్ క్లబ్‌లో కోచ్‌లు దినేష్ రాజోరియా, రాధికమండవ వద్ద శిక్షణ పొందిన ఉమ్మడి మహబూబ్‌నగర్‌కు చెందిన విక్టోరియా బర్కత్‌పురలో ఉంటున్నారు. తెలంగాణ స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పి.చంద్రశేఖర్‌రెడ్డి, స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు సతీష్ మట్ట బుధవారం విక్టోరియాను అభినందించారు.

కేడర్ ప్రాసిక్యూటర్ల ప్రమోషన్లపై అసత్య ప్రచారం

హైదరాబాద్ సిటీ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కేడర్ ప్రాసిక్యూటర్ల ప్రమోషన్‌లతో న్యాయవాదులకు అన్యాయం జరుగుతోందని సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని తెలంగాణ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్(కేడర్) అసోసియేషన్ ఖండించింది. రాష్ట్రంలోని 220 సెషన్ కోర్టుల్లో న్యాయవాదుల నుంచి టెన్యూర్ పీపీలుగా ఎన్నుకోబడిన 108 మంది వివిధ కోర్టుల్లో పనిచేస్తుండగా, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లుగా ఉద్యోగం పొంది ప్రమోషన్‌ల ద్వారా సెషన్ కోర్టుల్లో పీపీలుగా పనిచేస్తున్న వారు 42 మంది ఉన్నారని, కొంతమంది పనిగట్టుకొని తప్పుడు ప్రచారం చేస్తున్నారని కేడర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పి.శైలజ. జనరల్ సెక్రటరీ కె.నరేష్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖాళీ అయిన ఏపీపీ పోస్టుల్లో యువ న్యాయవాదులకు అవకాశాలు వస్తాయని వారు తెలిపారు.

9న అయోధ్య, కాశీ సహా ఐదు పుణ్యక్షేత్రాలకు రైలు

హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల నుంచి అయోధ్య, కాశీసహా ఐదు పుణ్యక్షేత్రాలను సందర్శించేందుకు ఐఆర్‌సీటీసీ తొమ్మిది రోజుల ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించింది. జూలై 9న సికింద్రాబాద్ స్టేషన్ నుంచి భారత్‌గౌరవ్ టూరిస్ట్ అయోధ్య-కాశీ పుణ్యక్షేత్రయాత్ర రైలు బయలుదేరుతుందని అధికారులు తెలిపారు. గయ, వారణాసి, సారనాథ్, అయోధ్య, ప్రయాగరాజ్‌లను సందర్శించే పర్యాటకుల కోసం ప్రత్యేక ప్యాకేజీ రూపొందించినట్లు వారు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9281495843, 9281495845లో సంప్రదించాలని ఐఆర్‌సీటీసీ ప్రతినిధులు తెలిపారు.

నిమ్స్‌లో పూర్తిస్థాయి చికిత్సలు అందిస్తున్నాం : బీరప్ప

హైదరాబాద్ సిటీ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): నిమ్స్ ఆస్పత్రిలో దుప్పట్ల కొరత కారణంగా గ్రామాల నుంచి వచ్చిన వారిని చేర్చుకోవడం లేదంటూ సోషల్ మీడియాలో వస్తున్న కథనం పూర్తిగా అవాస్తమని నిమ్స్ డైరెక్టర్ ప్రొ.బీరప్ప బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అత్యవసర సేవల విభాగం, ఔట్‌పేషంట్ల విభాగంలో రోగులను చేర్చుకుంటూ పూర్తిస్థాయిలో చికిత్సలు అందిస్తున్నామని ఆయన తెలిపారు. బుధవారం మధ్యాహ్నం ఒంటిగంటకు అన్ని విభాగాల అడ్మిషన్ జాబితాను విడుదల చేశారు.

ఒడిశా నుంచి మహారాష్ట్రకు గంజాయి

హైదరాబాద్ సిటీ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి మహారాష్ట్రకు గంజాయి తరలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాకు చెందిన ముగ్గురు సభ్యులను ఎల్బీనగర్ ఎస్ఓటీ, చౌటుప్పల్ పోలీసులు అరెస్ట్ చేశారు. మహారాష్ట్ర షోలాపూర్ బ్రహ్మపురి గ్రామానికి చెందిన బోంస్లే ఆబా మచ్చీంద్ర అలియాస్ అబా (29), షోలాపూర్ సౌత్‌కు చెందిన అవినాష్ శివాజీ రాథోడ్(19), షోలాపూర్ సౌత్ పాషానగర్‌కు చెందిన సిద్దరామేశ్వర్ పూజారి అలియాస్ సిద్దూ(27) స్నేహితులు. 10వ తరగతి వరకు చదువుకుని డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. వీరికి షోలాపూర్‌కు చెందిన గంజాయి విక్రేతఅజయ్ రాథోడ్‌తో పరిచయం ఏర్పడింది. అజయ్ డబ్బు, వాహనాలు సమకూర్చితే ఈ ముగ్గురు ఒడిశా అలూరికోటకు చెందిన తేజ నుంచి గంజాయి కొనుగోలు చేసి షోలాపూర్‌కు తీసుకొచ్చి అధిక ధరకు విక్రయిస్తున్నారు. గంజాయి కొనుగోలు చేసేందుకు అజయ్ రాథోడ్ డబ్బులు, కార్లు (స్విఫ్ట్ డిజైర్, ఇన్నోవా) సమకూర్చాడు. రెండు కార్లలో ఒడిశా వెళ్లిన ముగ్గురు నిందితులు 280 కిలోల గంజాయిని తీసుకొని విజయవాడ, ఖమ్మం, హైదరాబాద్ మీదుగా షోలాపూర్ వెళ్తున్నారు. వీరి దందాపై పక్కా సమాచారమందుకున్న ఎల్బీనగర్ ఎస్ఓటీ, చౌటుప్పల్ పోలీసులు పంతంగిటోల్‌గేట్ వద్ద కార్లను తనిఖీ చేశారు. రెండు కార్లు, 280 కిలోల గంజాయి, మూడు మొబైల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

యాక్సిల్ ఊడి నిలిచిన లారీ, ట్రాఫిక్ జామ్

పేట్‌బషీరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): దూలపల్లి చౌరస్తా సమీపంలో ఎన్‌హెచ్-44 రహదారిపై బుధవారం ఉదయం పైపుల లోడ్‌తో వెళుతున్న లారీ యాక్సెల్ ఊడిపోయి రహదారిపైనే నిలిచిపోయింది. దీంతో ట్రాఫిక్‌జామైంది. సమాచారం అందుకున్న అల్వాల్ ట్రాఫిక్ పోలీసులు రెండు క్రేన్లను సుకొచ్చి లారీని పక్కకు తీశారు.

నిజాంపేట్‌లో ప్రభుత్వ భూమి కబ్జా

అధికారులకు ఫిర్యాదు చేసిన బీజేపీ నాయకులు



ప్రభుత్వ భూమిగా బోర్డు ఏర్పాటుచేసిన అప్పుడు ఉన్న వీఆర్ఓ

నిజాంపేట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్ సర్వేనెంబర్ 82లోని దాదాపు 1000 గజాల ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఫెన్సింగ్, పిల్లర్లు వేసుకొన్న వ్యక్తులపై క్రిమినల్ కేసు నమోదు చేయించి, భూమిని స్వాధీనం చేసుకొని ప్రజావసరాలకు ఉపయోగించాలని కోరుతూ బుధవారం బీజేపీ నాయకులు కార్పొరేషన్ కార్యాలయంలో మేనేజర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా బీజేపీ కార్పొరేషన్ అధ్యక్షుడు ఆకుల సతీష్, కమిటీ సభ్యులు మాట్లాడుతూ నిజాంపేట్ సర్వేనంబర్ 82లో ఐదెకరాల ప్రభుత్వ స్థలాన్ని గతంలో ఎంఆర్ఓ పంచనామా చేయించి, కలెక్టర్ ఉత్తర్వుల ప్రకారం కార్పొరేషన్‌కు స్వాధీనం చేశారని, ఇందులో నాలుగెకరాల స్థలాన్ని పార్కుగా తీర్చిదిద్ది ఫెన్సింగ్ వేయించారని చెప్పారు. ఫెన్సింగ్ లోపల దాదాపు 3 వందల గజాలు ఆక్రమించారని, అందులో బోర్‌వెల్ వేసుకున్నారని, అధికారులు ఆ స్థలాన్ని ఇప్పటివరకు స్వాధీనం చేసుకోలేదని, ఆక్రమణదారులపై కేసులు పెట్టలేదని ఆరోపించారు. మిగిలిన ఎకరం స్థలాన్ని కబ్జా చేసి ఫెన్సింగ్ వేశారని, అందులో చిన్న గది నిర్మించారని తెలిపారు. 2019లో కబ్జాపై అప్పటి తహశీల్దార్ నిర్మల పోలీసులకు ఫిర్యాదు చేసి, కబ్జాదారులపై కేసు నమోదు చేయించారని, అప్పట్లో ఫెన్సింగ్ తొలగించిన కబ్జాదారులు 2021లో మరోసారి ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణాల కోసం కందకాలు తవ్వించారని, రెవెన్యూ అధికారులు మారినప్పుడల్లా ఈ తతంగం కొనసాగుతూనే ఉందని పేర్కొన్నారు. కబ్జాదారులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు.


మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

అధికారులు నిర్లక్ష్యం వీడాలి

- సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే మాధవరం
- కాలనీల్లో ఫాగింగ్ చేయించాలని ఆదేశం


దీనదయాళ్‌నగర్‌లో జలమండలి అధికారులు చేపట్టిన పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

ఫతేనగర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి కుంటు పడిందని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బుధవారం ఉదయం ఫతేనగర్ డివిజన్ వార్డు కార్యాలయంలో కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్, మూసాపేట్ సర్కిల్, డివిజన్‌కు సంబంధించిన అధికారులు, కాలనీ సంక్షేమ సంఘాల నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కాలనీ, బస్తీ సంక్షేమ సంఘాల సభ్యులు, స్థానికులు ఇచ్చిన ఫిర్యాదులను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కూకట్‌పల్లి ఆర్టీసీ డిపో నుంచి దీనదయాళ్ నగర్ వరకు రూ. 9 కోట్లు, మైసమ్మ చెరువు నుంచి వయా భరత్‌నగర్ మీదుగా దీనదయాళ్‌నగర్ వరకు రూ. 31 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. గౌతమీనగర్, భరత్‌నగర్, పైప్‌లైన్ రోడ్డులో డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. డివిజన్‌లో వీధి దీపాలు వెలగడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని, సమస్యను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. వర్షాలు పడుతున్నందున రోగాలు, విషజ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని తెలిసినా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. శానిటేషన్ సిబ్బంది రోజూ సాయంత్రం వీధుల్లో ఫాగింగ్ చేయాలని ఆదేశించారు. సమావేశంలో మూసాపేట్ సర్కిల్ ఉప కమిషనర్ రమేష్, మూసాపేట్ సర్కిల్ ఈఈ సత్యనారాయణ, డీఈ శ్రీదేవి, డివిజన్ ఏఈ పవన్, జలమండలి మేనేజర్ అనిల్‌కుమార్, విలియం ప్రకాష్, విద్యుత్ ఏఈ మౌనిక, బీఆర్ఎస్ డివిజన్ నాయకులు భిక్షపతి, కూతాడి రాములు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

కూకట్‌పల్లి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): బాలాజీనగర్ డివిజన్ పరిధి రెయిన్‌బో విస్టా అపార్ట్‌మెంట్స్ సముదాయంతో పాటు పరిసర ప్రాంతాల్లో సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు బుధవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు వినతిపత్రం సమర్పించారు. కాముని చెరువులో గుర్రపుడెక్క పేరుకుపోవడంతో దోమల బెడద తీవ్రంగా ఉందని, మురుగునీటి శుద్ధి కేంద్రం పనులను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని, సేవాలాల్‌నగర్, ఖైతలాపూర్ కాలనీల మధ్య రోడ్డును విస్తరించాలని, గ్రీన్‌హిల్స్ రోడ్డులో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ మేరకు స్పందించిన ఎమ్మెల్యే సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రెయిన్‌బో విస్టాస్ రాక్‌గార్డెన్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.మధుసూదన్‌రెడ్డి, సభ్యులు రామిడి ప్రమోద్‌రెడ్డి, రామ్‌కిరణ్, పూసపాటి దీప్తి పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు


పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన పూజల్లో భక్తులు

కూకట్‌పల్లి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ కాలనీ టెంపుల్ బస్టాపులోని పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ 31వ వార్షిక బ్రహ్మోత్సవాలు కన్నుల పండువగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. తులసి గజమాల అలంకరణతో ప్రారంభమైన సేవలు రాత్రి నీరాజనంతో ముగిశాయి. ప్రత్యేక తులసి అర్చన, లక్ష్మిగణపతి స్వామికి సహస్రాభిషేకం, నవగ్రహ హోమం, మహా సుదర్శనహోమం, హంసవాహన సేవలు జరిపించారు. బ్రహ్మోత్సవ గొడుగులతో హసం వాహనంపై శ్రీవారిని తిరుమాడ వీధుల్లో నిర్వహించిన ఊరేగింపు కార్యక్రమంలో వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో శారద జనస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన కర్ణాటక సంగీత గాత్రకచేరి భక్తులను ఆకట్టుకొంది. బ్రహ్మోత్సవ వేడుకలు జూలై 1 వరకు కొనసాగుతాయని ఆలయ కమిటీ నిర్వాహకులు శ్యామలరాజు తెలిపారు.

బాలుడిపై దాడికి పాల్పడిన వారిని శిక్షించాలి

బాలానగర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): షాబాద్ మండలం కేసర గ్రామ నివాసి బేకరి రాములు కుమారుడు యాదగిరిపై జరిగిన దాడిని ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు తీవ్రంగా ఖండించారు. బుధవారం సభ్యులు తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు కోడిగంటి లక్ష్మయ్య, జిల్లా శంకర్‌ను కలిసి బాలుడిపై జరిగిన దాడిని వివరించారు. దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైనప్పటికీ ఇంతవరకు పోలీసులు వారిని అరెస్ట్ చేయలేదని ఆరోపించారు. కమిషన్ సభ్యులు జోక్యం చేసుకుని రాములు కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాడారం వినయ్‌కుమార్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు కర్మనాగరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బేగరి రాజు, కోశాధికారి ప్రమోద్‌కుమార్, అప్పల్‌రాజు, వినయ్‌కుమార్, సదామహేష్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తా : కూన

గాజులరామారం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తానని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకుడు కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు బస్తీలు, కాలనీల్లో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం పలువురు ఆయనను కలిసి వినతిపత్రం సమర్పించారు. స్పందించిన శ్రీశైలంగౌడ్ పలు శాఖల అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్ ప్రశాంత్‌గౌడ్, మాజీ కౌన్సిలర్ ఐలయ్య పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి : శంభీపూర్ కృష్ణ

దుండిగల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అన్నారు. బౌరంపేట్ 19వ వార్డులోని సింహపురి కాలనీలో రూ. 28 లక్షలతో సీసీ రోడ్డు, రూ. 26 లక్షలతో బీటీ రోడ్డు పనులను బుధవారం వైస్ చైర్మన్ పద్మారావు, కౌన్సిలర్ వనితా బుచ్చిరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో పనులకు ఇబ్బంది కలగకుండా పూర్తి చేయాలని, నాణ్యతలో రాజీ పడవద్దని అన్నారు. కార్యక్రమంలో నాయకులు బుచ్చిరెడ్డి, మురళీయాదవ్, ధర్మారెడ్డి, శామీర్‌పేట రంగయ్య, రామ్‌కుమార్, నర్సింహా రెడ్డి, నవీన్ పాల్గొన్నారు.


శంభీపూర్ రాజు కుటుంబసభ్యులతో మాజీ మంత్రి కేటీఆర్

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఇంటికి కేటీఆర్

దుండిగల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు నివాసానికి బుధవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ బుధవారం వచ్చారు. ఆయనతో పాటు ఎమ్మెల్యేలు కేపీ.వివేకానంద్, పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు గ్యాదరి బాలమల్లు, మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.


నాలాలో మొదలైన బ్రిడ్జి పనులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మొదలైన బ్రిడ్జి పనులు

పేట్‌బషీరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): 'బ్రిడ్జి నిర్మాణం మరిచారు, లోక్‌సభ ఎన్నికల ముందు పాత బ్రిడ్జి కూల్చివేత, ఎన్నికలు ముగిసినా మొదలు కాని పనులు, వర్షాలకు ఇళ్లలోకి వస్తున్న మురుగు నీరు శీర్షికతో ఈ నెల 15న 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి అధి కారులు స్పందించారు. బుధవారం వెంకన్నహిల్స్ నాలాలో బ్రిడ్జి పనులను మొదలుపెట్టారు. ఈ సందర్భంగా కాలనీవాసులు 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలియజేశారు.

పాలిటెక్నిక్ అడ్మిషన్లకు 44,806 మంది దూరం

- సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు 24,922 మందే హాజరు

హైదరాబాద్ సిటీ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్‌లలో అడ్మిషన్లకు ఈ ఏడాది సుమారు 44,806 మంది అభ్యర్థులు దూరమయ్యారా అంటే.. అవుననే అంటున్నారు అధికారులు. ఈ ఏడాది పాలిసెట్‌కు మొత్తం 92,808మంది నమోదు చేసుకోగా, 82,809మంది పరీక్ష రాశారు. వీరిలో 69,728మంది ఉత్తీర్ణులు కాగా, మంగళవారంతో ముగిసిన ధ్రువపత్రాల పరిశీలనకు 24,922 మందే హాజరు కావడం గమనార్హం. పాలిటెక్నిక్‌లలో అడ్మిషన్లు తీసుకొని ఇంజనీరింగ్ డిప్లమో కోర్సులు చదివితే త్వరతిగతిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందవచ్చని టెన్త్ పాసైన విద్యార్థులు భావిస్తారు. కొన్నేళ్లుగా గ్రామీణ ప్రాంతాలకు నుంచే ఎక్కువమంది మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులే ఈ డిప్లమో కోర్సుల వైపు మొగ్గుచూపుతున్నారు. పాలిసెట్ పరీక్ష రాసినపుడు విద్యార్థుల్లో ఉండే ఉత్సాహం, కౌన్సెలింగ్ సమయంలో కనిపించడం లేదు. పాలిసెట్ రాయడం వలన కలిగే ప్రయోజనాలు, డిప్లొమో కోర్సులతో లభించే ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై సాంకేతిక విద్యాశాఖ అధికారులు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. దీంతో ప్రతియేటా సుమారు 90వేల నుంచి లక్షమంది వరకు విద్యార్థులు ఆసక్తితో దరఖాస్తులు సమర్పిస్తున్నారు. అయితే, పాలిసెట్ ఫలితాలు వెల్లడయ్యాక, ఉత్తీర్ణులైన విద్యార్థులను గుర్తించి కౌన్సెలింగ్‌కు రప్పించడం, అడ్మిషన్లు పొందేవరకు వారికి అవగాహన కల్పించడంపై అధికారులు శ్రద్ధ చూపడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కౌన్సెలింగ్‌కు హాజరైన అభ్యర్థులు సైతం కాలేజీలు/కోర్సులకు ఆప్షన్లు ఇచ్చుకోవడం ఎలాగో తెలియక ఇబ్బంది పడుతున్నారు. వీరికి సాయమందించేందుకు ఏర్పాటు చేసిన కొన్ని హెల్ప్‌లైన్ సెంటర్లు సిబ్బంది కొరతతో హెల్ప్‌లెస్ సెంటర్లుగా మారాయి. దీంతో ప్రతియేటా పాలిటెక్నిక్‌లలో ఉన్న 29వేల సీట్లలో సుమారు 4వేల నుంచి 5వేల డిప్లొమో సీట్లు ఖాళీగానే ఉండిపోతున్నాయి. పాలిసెట్‌కు రిజిస్ట్రేషన్ సమయంలో సాంకేతిక విద్యాశాఖ అధికారులు చూపిస్తున్న చొరవను, కౌన్సెలింగ్ పూర్తయ్యేదాకా కొనసాగిస్తే బాగుండేదని విద్యార్థుల తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం తొలివిడత కౌన్సెలింగ్ పూర్తయినందున, రెండోవిడత కౌన్సెలింగ్‌కైనా పాలిసెట్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఎక్కువమంది హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, హెల్ప్‌లైన్ సెంటర్లలో మరిన్ని సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు.

'మియాపూర్' ఘటనలో మరో నలుగురి అరెస్ట్

ఇప్పటి వరకు మొత్తం 56 మంది రిమాండ్

మియాపూర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములను ఆక్రమించడానికి ప్రయత్నించే క్రమంలో అడ్డుకున్న పోలీసులపై గుడిసెలు వేయడానికి వచ్చిన పేదలు, కబ్జాదారులు రాళ్లవర్షం కురిపించడంతోపాటు ప్రభుత్వ అధికారుల విధులకు ఆటంకం కలిగించడం లాంటి సంఘటనలపై ఇప్పటికే మియాపూర్ పోలీసులు 52మందిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. బుధవారం మరో నలుగురిని రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ రామలింగదుర్గప్రసాద్ తెలిపారు. దీంతో ఇప్పటి వరకు 56మందిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇంకా ఈ సంఘటనకు సంబంధించి మరికొంతమందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వారిని కూడా త్వరలోనే పట్టుకుని రిమాండ్‌కు తరలిస్తామని పోలీసులు పేర్కొన్నారు. మరో పక్క నాలుగు రోజుల నుంచి మియాపూర్‌లోని ప్రశాంత్‌నగర్, దీప్తిశ్రీనగర్, హెచ్ఎంటీ మక్తా కాలనీ సరిహద్దులో ఉన్న ప్రభుత్వ భూమి పెన్సింగ్ ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. కొంత పోలీస్‌బందోబస్తును తగ్గించినపట్టికీ ఇంకా పోలీస్ పహారాలోనే ప్రభుత్వ భూముల చుట్టూ నిరంతరం నిఘా కొనసాగుతోంది.


లింక్‌రోడ్డు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

లింక్‌రోడ్డు నిర్మాణం త్వరలో పూర్తిచేస్తాం : ఎమ్మెల్యే

రాయదుర్గం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడ ప్రధాన రహదారి నుంచి రాయదుర్గం వరకు చిత్రపురి కాలనీ మీదుగా నూతనంగా చేపట్టబోయే 120 అడుగుల లింక్‌రోడ్డును మాజీ కార్పొరేటర్ సాయిబాబా, టౌన్‌ప్లానింగ్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే గాంధీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు, వాహనదారులకు ఇబ్బంది లేకుండా లింక్‌రోడ్డు ఏర్పాటు చేస్తామని తెలిపారు. త్వరలోనే పనులు చేపట్టి పూర్తిచేస్తామని, ప్రజలకు ట్రాఫిక్ కష్టాల నుంచి విముక్తి కలిగిస్తామని చెప్పారు. నియోజకవర్గంలో అండర్‌పాస్‌లు, ఫ్లైఓవర్లు పూర్తిచేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సిటీప్లానర్ గణపతి, టీపీఎస్ రవీందర్, నాయకులు రామరాజు, సాయి వైభవ్‌కాలనీ అధ్యక్షుడు పద్మావతి, సుజిత్, సత్యనారాయణ, శ్రీనివాస్, అశోక్, రాజు, సరస్వతి, స్థానికులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ ప్రశాంతం

కూకట్‌పల్లి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన విద్యాసంస్థల బంద్ కూకట్‌పల్లిలో ప్రశాంతంగా ముగిసింది. ఏబీవీపీ పిలుపు మేరకు పలు ప్రైవేట్ విద్యాసంస్థలు ముందస్తుగా సెలవు ప్రకటించాయి. కూకట్‌పల్లిలో ప్రభుత్వ పాఠశాలలను ఏబీవీపీ కార్యకర్తలు మూసివేయించారు. ఏబీవీపీ కూకట్‌పల్లికన్వీనర్ ప్రతీక్‌గౌడ్ ఆధ్వర్యంలో కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు.

పైపులైన్ పనుల్లో వేగం పెంచండి: కార్పొరేటర్

కేపీహెచ్‌బీకాలనీ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో తాగునీటి సరఫరాను దృష్టిలో పెట్టుకొని నిర్మాణంలో ఉన్న పైప్‌లైన్ పనులను వేగవంతం చేయాలని కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు బుధవారం జలమండలి అధికారులను ఆదేశించారు. కల్వరి టెంపుల్ నుంచి నాలుగో ఫేజ్ ఎస్టీపీ వరకు నిర్మాణంలో ఉన్న తాగునీటి పైపులైన్ పనులను బుధవారం అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం శంషీద్, మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యలుంటే భయపడకుండా చెప్పండి : డీసీపీ

జీడిమెట్ల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జగద్గిరిగుట్టలో అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతామని బాలానగర్ డివిజన్ డీసీపీ కె.సురేష్‌కుమార్ అన్నారు. డీసీపీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత బుధవారం సాయంత్రం జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. అనంతరం జగద్గిరిగుట్ట బస్టాప్, ఎల్లమ్మబండ, చెరువు వద్ద, వివిధ బస్తీలు, కాలనీల ప్రజలతో మాట్లాడారు. ఎలాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. పోలీసుల పనితీరు ఎలా ఉంది అని తెలుసుకున్నారు. ప్రజలకు రక్షణ కల్పించడమే తమ ధ్యేయమని, సమస్యలుంటే భయపడకుండా తెలపాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీపీ హన్మంత్‌రావు, జగద్గిరిగుట్ట సీఐ క్రాంతికుమార్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశ్నిస్తే కక్షసాధింపు చర్యలా? : ఎస్ఎఫ్ఐ

రాయదుర్గం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని సమస్యలను ప్రశ్నించిన విద్యార్థులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఎస్ఎఫ్ఐ నాయకులు ఆరోపించారు. ఐదుగురు విద్యార్థులను ఆరు నెలలు సస్పెండ్ చేశారని, వారికి న్యాయం జరిగే వరకు ఆందోళన విరమించే ప్రసక్తే లేదన్నారు. వర్సిటీలో మరో వెలివాడ ఏర్పాటుకు వీసీ, రిజిస్ట్రార్ ప్రయత్నం చేస్తున్నారని, వీసీ బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని వారు ఆరోపించారు. విద్యార్థులపై సస్పెన్షన్, వారిపై నమోదు చేసిన కేసులు ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు. కేసులు ఎత్తివేయకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

అదృశ్యమైన యువకుడు.. సంపులో శవమై..

పోలీసుల అదుపులో మృతిడి స్నేహితులు

పటాన్‌చెరు, జూన్ 26 : మూడు రోజుల క్రితం అదృశ్యమైన యువకుడు అనుమానాస్పద స్థితిలో నీటిసంపులో శవమై దొరికిన సంఘటన సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం వెలుగుచూసింది. వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్ మియాపూర్ ప్రాంతంలోని పోగుల ఆగయ్యనగర్‌కు చెందిన నితిన్(26) ఆదివారం రాత్రి నుంచి కనిపించకుండా పోయాడు. కుటుంబ సభ్యులు మరుసటి రోజు మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు నితిన్ స్నేహితులు వెంకటేశ్‌తో పాటు కొందరిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. నితిన్ ఆదివారం రాత్రి స్నేహితులతో కలిసి అమీన్‌పూర్‌లోని పెద్దచెరువు పక్కన ఉండే పాంచజన్యకాలనీలో పార్టీ చేసుకున్నట్లు తెలిసింది. దీంతో మియాపూర్ పోలీసులు అమీన్‌పూర్ పోలీసులకు యువకుడి మిస్సింగ్ సమాచారం ఇచ్చారు. నితిన్ స్నేహితులైన వెంకటేశ్ మరో 12 మంది యువకులను అమీన్‌పూర్ పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. మొదట పొంతనలేని సమాధానాలు చెప్పగా, లోతుగా విచారించగా అసలు విషయం తెలిసింది. ఆదివారం రాత్రి నీటి ట్యాంక్ వద్ద పుట్టినరోజు పార్టీ చేసుకున్న తరువాత నితిన్ సంపులో పడి చనిపోయాడని తెలిపారు. వారిని వెంటబెట్టుకుని పోలీసులు ట్యాంకు వద్దకు చేరుకున్నారు. నీటి సంపును పరిశీలించగా నితిన్ మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని వెలికి తీసి సంగారెడ్డి ఆసుపత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు. స్నేహితులందరూ గంజాయి సేవించినట్లు తెలిసోంది. స్నేహితుల మధ్య వ్యక్తిగత, పాతకక్షలతో ఘర్షణ పడ్డట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. దర్యాప్తు చేస్తున్నామని అమీన్‌పూర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు.